ఏఎమ్మార్పీ ఆయకట్టుకు జలకళ

- ఊపందుకున్న వరినాట్లు
- పెరగనున్న సాగు విస్తీర్ణం
- కంపచెట్లతో నిండిన మైనర్ కాల్వలు
- సాఫీగా నీరు ప్రవహించేలా చూడాలని కోరుతున్న రైతులు

గుర్రంపోడు : ఏఎమ్మార్పీ ఆయకట్టుకు నీటి విడుదలతో వరినాట్లు ఊపందుకున్నాయి. అధికారికంగా నీటి విడుదల కన్నా ముందు నుంచే అధికారులు రైతులు అవసరాలను దృష్టిలో ఉంచుకొని గేట్లను కొంతమేర రైతులు ఎత్తుకున్న చూసీచూడనట్లు ఉండటంలో కాల్వల నీటితో పొలాను దున్నేసుకున్నారు. ఇప్పుడు పూర్తిస్థాయిలో నీరు అందుతుండటంతో వరినాట్లు ముమ్మరం చేస్తూ రైతులు బిజీగా ఉన్నారు. ఆగస్టు రెండో పక్షం లోగా వరినాట్లు పూర్తిచేయాలనే సంకల్పంతో రైతులు ఉన్నారు. గతంలో ఆలస్యంగా నీటి విడుదల జరిగి వరినాట్లు వానాకాలంలో తీవ్ర ఆలస్యమై దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపేది. అయితే ఈసారి ముందస్తుగానే నీటి విడుదల జరగడంతో రైతులు సకాలంలో పూర్తిస్థాయిలో వరిసాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

పెరగనున్న వరిసాగు

గత వానాకాలం సీజన్‌లో మండలంలో 16వేల ఎకరాల్లో వరిసాగు కాగా ఈసారి 20వేల ఎకరాలకు తగ్గకుండా అవతుందని వ్యవసాయ శాఖ అంచనా. గత యాసంగి సీజన్‌లో 20వేల ఎకరాల సాగు గరిష్టంగా నమోదు కాగా ప్రస్తుత వానాకాలం సీజన్ వరిసాగు రికార్డు స్థాయిలో జరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వ్యవసాయశాఖ మండల పరిధిలో రైతుల అవసరాలకు తగ్గట్టుగా యూరియా నిల్వలు ఉంచడం, డీలర్ల బల్క్ అమ్మకాల పేరుతో బ్లాక్‌మార్కెట్ చేయకుంగా నిరోధించడంతో యూరియా కొరత లేకపోవడం రైతులకు ఊరట కల్గిస్తుంది.


గుర్రంపోడులో ఆయకట్టులో వరినాట్లు వేస్తున్న కూలీలు

కాల్వలు ఇలా.. నీరు పారేదెలా

మండలంలో ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ వెంట గల డీ 16 నుంచి డీ25 వరకు 40వేల ఎకరాల ఏఎమ్మార్పీ ఆయకట్టు మండల పరిధిలో ఉంది. 65కిలోమీటర్ల పొడవునా మేజర్ కాల్వల వెంట కంపచెట్లు గత ఏడాది తొలగించారు. మరో 70వేల ఎకరాల్లో మైనర్ కాల్వల మరమ్మతులు చేపట్టకపోవడంతో కంపచెట్లు, పూడికలు నిండి ఉన్నాయి. ఈ కాలువలను మరమ్మత్తు చేయకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరు చేరేదెలా అని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.


కొప్పోలు వద్ద కంపచెట్లతో నిండిన మైనర్ కాల్వ

పంట కాల్వలు తవ్వాలి



ఏఎమ్మార్పీ ఆయకట్టులో గతంలో తవ్విన పంట కాల్వలు అసంపూర్తిగా ఉండటం, మరికొన్ని చొట్ల పూడిక పోవడంతో ఆయకట్టు స్థిరీకరణ పూర్తిగా జరగడం లేదు. కాల్వ మొదట్లోని రైతుల భూముల పారుతూ కింది రైతుల భూములకు నీరు అందడం లేదు. చెరువులకు ఆయకట్టు చివరిలో నీరు చేరడం లేదు. అంగడిపేట డివిజన్ పరిధిలోకి వచ్చే మా గ్రామ పరిధిలోని మేజర్ కాల్వలకు మరమ్మతులకు నోచుకోలేదు.

– వెంకట్‌రెడ్డి, రైతు, మొసంగి

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మిర్యాలగూడ అర్బన్ : చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని షీ టీం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని కాకతీయ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు అలవాటు పడి కొత్త పరిచయాలు చేసుకొని ఆకర్శితులవుతున్నారన్నారు. సెల్ ఫోన్లలో వచ్చే కొత్త లింక్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. బాలికలు అపరితులపై అప్రమత్తంగా ఉండాలని, పోకిరీలు వేధిస్తే పోలీసులకు సమాచారం అందిచాలని సూచించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ లు ఎండి కెఎం షరీఫ్, ప్రభాకర్, మహిళా కానిస్టేబుల్ రాజేశ్వరి, రవి, అయ్యూబ్ పాల్గొన్నారు.

మాడుగులపల్లి : యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ కృష్ణయ్య అన్నారు. గురువారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన డ్రగ్స్, గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిర్మూలించాలని చేపట్టిన యువ చైతన్య సైకిల్ యాత్ర మాడుగులపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు చేరుకోగా ఎస్‌ఐ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, పుల్లెంల శ్రీకర్, ఊర ఎల్లయ్య, మల్లారెడ్డి, రవి, వెంకన్న, గురుస్వామి, అనిల్, మాధవ్, రాజు, సలీంద్ర, గుండాల నరేష్, కట్టా లింగస్వామి, మహేష్, సాయి తేజ, రాజేష్, కిరణ్, వేణు పాల్గొన్నారు.


మాడుగులపల్లి : మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు



మిర్యాలగూడ అర్బన్ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం పోలీసులు

క్లుప్తంగా

పెట్రోల్ బంక్‌ల పరిశీలన

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని అంగడి పేట ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న పెట్రోల్ బంకులను గురువారం పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంకు నిర్వాహకులు వినియోగదారులు ఆదరణ పొందేలా నిర్వహణ ఉండాలని సూచించారు. బంకు నిర్వాహకులు నో స్టాక్ బోర్డు పెట్టకుండా చూడాలన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

పెద్దవూర : అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సక్రు నాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం గాంధీ భవన్ ముట్టికి వెళ్తున్న క్రమంలో ముందస్తుగా ఆయనను అరెస్ట్ చేశారు. ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం పిరికిపంద చర్య అన్నారు.

బస్‌చార్జీలు తగ్గించాలని డీఎంకు వినతి

మిర్యాలగూడ టౌన్ : టోల్ చార్జీలు పెంపుతో పెంచిన బస్ చార్జీలను తగ్గించాలని కోరుతూ బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ డీఎం రాంమోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎండీ షోయబ్, రాష్ట్ర నేత రాపోలు నవీన్ కుమార్ మాట్లాడుతూ టోల్ గేటు చార్జీలు పెంచారనే సాకుతో ప్రయాణికులపై అదనపు భారం మోపడం సరైంది కాదన్నారు. అదే విధంగా విద్యార్థులకు బస్సు పాస్ చార్జీలను కూడా పెంచడంతో మరింత ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం బస్‌చార్జీలు తగ్గించాలని ఆ పత్రంలో కోరారు.

దేవరకొండ సీఐగా వెంకట్‌రెడ్డి



దేవరకొండ : దేవరకొండ నూతన సీఐగా వెంకట్‌రెడ్డి గురువారం భాద్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన నర్సింహులు హైదరాబాద్‌కు బదిలీకాగా నల్లగొండ డీసీఆర్‌బీలో పని చేస్తున్న వెంకట్ రెడ్డి బదిలీపై దేవరకొండకు వచ్చాడు. ఆయనకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు.

డంపింగ్ యార్డుకు అనుమతులు నిలిపివేయాలి

దేవరకొండ : మండలంలోని గిరిజానగర్ తండా పరిధిలో చేపట్టనున్న డంపింగ్ యార్డు నిర్మాణ అనుమతులు నిలిపివేయాలని కోరుతూ పలువురు తండావాసులు గురువారం దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీలో గ్రామసభ నిర్వహించకుండా, గ్రామస్తులకు సమాచారం లేకుండా నిర్మిస్తున్న డంపింగ్ యార్డు పనులు వెంటనే నిలిపివేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కళ్యాణ్ ఉన్నారు

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

డిండి : ఇందిరమ్మ ఇళ్లకు అనుమతితో ఇసుక రవాణ చేస్తున్న క్రమంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని దాసరినెమలిపూర్, వావిల్‌కోల్, కందుకూర్ గ్రామాలలోని ట్రాక్టర్ యాజమానులతో స్థానిక ఎస్.ఐ.బాలకృష్ణతో కలిసిఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా లబ్ధిదారుల నుంచి అధిక డబ్బులు వసూలు చేయొద్దని వారు సూచించారు.

ముత్యాలమ్మకు బోనాలు


అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు చేస్తున్న భక్తులు

వేములపల్లి : మండలంలోని శెట్టిపాలెంలో గురువారం ఊర బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు గ్రామంలోని పలు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో చల్లంగా చూడాలని భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

దేవరకొండ : పట్టణంలోని ముత్యాలమ్మ బజార్‌లో యాదవుల కులదైవం పెద్దమ్మ తల్లి దేవాలయంలో గురువారం యాదవ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెదమ్మ పండుగ, ఉట్ల పండుగ, బోనాల పండుగలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు నక్క వెంకటేష్‌యాదవ్‌యాదవ సంఘం నాయకులు నేతాళ్ల వెంకటేష్‌యాదవ్, నల్లగాసు విజయ్, శవ్వ వెంకటయ్య, వెంకటయ్య, సలేశ్వర్ ఉన్నారు.

సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందంజ

నిడమనూరు : సేవా కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్ ముందువరుసలో ఉంటుందని ఆ క్లబ్ అధ్యక్షుడు బెల్ల అశోక్ అన్నారు. లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ సమావేశం శాఖాపురంలోలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జిల్లాలోనే నిడమనూరు లయన్స్‌క్లబ్ సేవ కార్యక్రమాల్లో ముందుడేలా కార్యవర్గం పనిచేస్తుందన్నారు. రెండు దశాబ్దాలుగా లయన్స్ క్లబ్ స్ఫూర్తిదాయకంగా పనిచేసిందన్నారు. విద్య, వైద్య రంగాలతోపాటు, పేదలకు చేయూతనిచ్చేలా లయన్స్‌క్లబ్ పనిచేస్తోందన్నారు. నూతన కార్యవర్గంలో కార్యదర్శిగా చిత్రం అశోక్, కోశాధికారిగా బ్రహ్మన్న, వైస్ ప్రెసిడెంట్ గండికోట యాదగిరి, కాసోజు తిరుపతయ్యచారి, కోఆర్డినేటర్‌గా పోలె డెవిడ్, సర్వీస్ చైర్‌పర్సన్‌గా నందికొండ మట్టారెడ్డి, మెంబర్ షిప్ చైర్మన్‌గా చేకూరి వంశీచరణ్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా కేబినెట్ సెక్రటరీ చిలుకూరి రామకృష్ణ, కేవీ ప్రసాద్‌లు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చేకూరి హన్మంతరావు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కర్నాటి రమేష్, క్లబ్ మాజీ అధ్యక్షుడు పాంపాటి శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, ఉన్నం చిన వీరయ్య, సూర్యానారాయణ, రాము, పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన క్లబ్ కార్యవర్గ సభ్యులు

సాయినాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు


సాయినాథుడి ఆలయంలో గోవుల వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు

చింతపల్లి : మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడి దేవాలయాన్ని గురువారం దేవరకొండ, మిర్యాలగూడ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డిలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గోశాలలో గోవులకు ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హైదరాబాద్ నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారి పక్కనే ఉన్న సాయినాథుడి దేవాలయం మరింత అభివృద్ధి చెందుతుంన్నారు. దేవాలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, ముచ్చర్ల యాదగిరి,గోవర్ధన్, భాస్కర్, నరేందర్ పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం తప్పనిసరి

త్రిపురారం : టీబీ వ్యాది గ్రస్తులు సకాలంలో పోషకాహరం తీసుకోవాలని త్రిపురారం మండల వైద్యాధికారి డాక్టర్ సంజయ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా గ్రామాల్లోని టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సంజయ్ మాట్లాడారు. టీబీ మందులతో పాటు బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం వల్ల టీబీ వ్యాధి సకాలంలో నయమవుతుందన్నారు. సీజనల్ వ్యాదులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ ఆస్పత్రుల సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ కమలమ్మ, టీబీ నోడల్ అధికారి పుట్ట గోపాల్ రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ నళిని కాంత్, భవాని, శాంతి, ఏఎస్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది

ఉపాధ్యాయులు.. సామాజిక నాయకులు


భిక్షపతిని సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పెద్దవూర : ఉపాధ్యాయుడు బోధకుడే కాదని సామాజిక నాయకుడు కూడా అని మండల విద్యాధికారి తరి రాము అన్నారు. గురువారం మండలంలో ఊట్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం కొంపల్లి భిక్షపతి ఉద్యోగ విరమణ, సన్మానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని వృత్తుల్లోకెల్ల ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదన్నారు. ఇలాంటి వృత్తిలో 28ఏళ్లుగా సుదీర్ఘకాలం పాటు అనేక మంది విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దిన మృదుస్వభావి అన్నారు. అనంతరం ఆయనను శాలువాలు, పూల దండలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తిరుమలగిరి(సాగర్) మండల విద్యాధికారి కొనమంచిలి శ్రీనివాస్, నోడల్ అధికారి శేషు, ఉపాధ్యాయులు ఝాన్సీ సుదర్శన్,వెంకటేశ్వర్‌రెడ్డి, వీరారెడ్డి, కృష్ణ, జార్జి, ఉపేంద్రమ్మ, నాగిరెడ్డి,రామలింగం, అరుణ తదితరులు పాల్గొన్నారు.

‘పెండ్లిపాకల’ నుంచి నీటిని విడుదల చేయాలి

కొండమల్లేపల్లి : పెండ్లిపాకల రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలని కోరుతూ బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్ గురువారం నీటిపారుదల శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండ్లిపాకల రిజర్వాయర్ ద్వారా నీటిని విడుదల చేసి పెండ్లిపాకల, చింతకుంట్ల, చెన్నంనేనిపల్లి, రమావత్‌తండా, పకీర్‌పురం, దేశ్‌ముక్‌కుంట, పీల్యతండా, వర్ధమానిగూడెం, అచ్చంపేటపట్టి, సింగ్యతండాల రైతులను ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎటెల్లి రాంబాబు, నాను బాపోజి, అనిల్ ఉన్నారు.


అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆశాలకు కనీస వేతనం నిర్ణయించాలి

రామగిరి (నల్లగొండ): ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, నల్లగొండ మండల కన్వీనర్ పోలె సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండ మండలంలోని రాములబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు కనీస వేతనాలు లేక కుటుంబాలు నడపలేని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 3న నల్లగొండలో జిల్లా స్థాయి ఆశా కార్యకర్తల సమావేశం జరుగుతుందని సమావేశానికి అధిక సంఖ్యలో ఆశాలు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు అవుట రవీందర్, అద్దంకి నరసింహ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు భారతి, మంగమ్మ, సంతోష, తేజేశ్వరి, సైదమ్మ, చైతన్య, శోభారాణి, కవిత, జ్యోతి, పారిజాత, పుష్పలత పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి : మండలంలో పూర్తి స్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. గురువారం మండలంలోని కొల్‌ముంతలపహడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని బాపూజీనగర్‌లో నూతనంగా నిర్మించిన వాటర్ పైప్‌లైన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీ, జేవీ కాలనీలో నూతనంగా నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో పలు శుభ కార్యాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం కోటా కోసం ‘చలో ఢిల్లీ’

తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి ఆగస్టు 5,6,7 తేదీల్లో ఢిల్లీ వెళ్లనున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్టు 5న పార్లమెంట్‌లో ఎంపిల ద్వారా వాయిదా తీర్మానం, 6న రాష్ట్రంలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులతో జంతర్‌మంతర్ వద్ద ‘చలో ఢిల్లీ’ కార్యక్రమం, 7న సీఎంతో పాటు మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, బీసీ సంఘాల నేతలతో కలిసి రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టం 2018లో రిజర్వేషన్లపై ఉన్న 50శాతం పరిమితిని ఎత్తివేస్తూ తెచ్చిన ఆర్డినెన్స్ ఫైల్‌ను రాష్ట్ర ప్రభుత్వం జూలై 14న గవర్నర్‌కు పంపగా ఫైల్‌ను గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కొండమల్లేపల్లి : అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇస్తాం

పెద్దఅడిశర్లపల్లి : అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు అందిస్తామని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. గురువారం మండలంలో ఉమ్మడి పెద్ద అడిశర్లపల్లి మండలంలో మంజూరైన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుందన్నారు. ప్రతి పేదవాడి అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్లు జయశ్రీ, మధుహాసిని, కాంగ్రెస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, తదితరులు పాల్గొన్నారు.


పెద్దఅడిశర్లపల్లి : నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

గుడిపల్లి మండలంలోని కేశంనేనిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను సూచించారు.

నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యేకు వినతి

గుడిపల్లి మండల కేంద్రంలో గురువారం డీ7బీ కాలువకు నీటిని విడుదల చేయాలని గుడిపల్లి రైతులు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌ను కోరారు. మండలంలోని కేశంనేనిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే కారును ఆపి వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే నీటి విడుదలకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

క్రీడల్లో రాణిస్తే సమాజంలో మంచి గుర్తింపు

మిర్యాలగూడ టౌన్ : క్రీడల్లో రాణిస్తే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని జూడో జిల్లా సెక్రెటరీ ఎస్‌కె ఫర్వేజ్ అన్నారు. గురువారం స్థానిక బీసీ భవనంలో నిర్వహించిన కరాటే జూడో సబ్ జూనియర్ పోటీలను జూడో జిల్లా వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఈ పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి సబ్ జూడో పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్‌లో ఈనెల 5, 6, 7వ తేదీల్లో నిర్వహించనున్న సబ్ జూనియర్ జూడో పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు మారం శ్రీనివాస్, జయరాజు, మురళియాదవ్, అడ్వకేట్ ఉమాశంకర్ పాల్గొన్నారు.

జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

మిర్యాలగూడ టౌన్ : పట్టణ కేంద్రలో శుక్రవారం నిర్వహించనున్న పింఛన్‌దారుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నేత దైద సత్యం, వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ అహ్మద్ ఖాన్‌లు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో పాలక ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని అన్నారు. పెద్ద సంఖ్యలో హాజరుకవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీఎస్ నాయకులు సైదులు, మధన్‌నాయక్, పాల్వాయి సుధాకర్, ఎండి ఖలీం, అఫ్సర్, శ్రీను, విజయ్, మధు, ఖాసీం, మాధవరెడ్డి, రాజయ్య, సురేష్, శ్రీకాంత్, వెంకన్న, రవి, బాలకృష్ణ, నాగరాజు, సైదులు తదితరులున్నారు.

ప్రజాసేవకు అంకితమవ్వాలి

మిర్యాలగూడ అర్బన్ : ఉద్యోగ విరమణ అనంతరం ప్రజా సేవకు అంకితమవ్వాలని ట్రాన్స్‌కో డీఈ ఎం.శ్రీనివాస చారి అన్నారు. గురువారం విద్యుత్ లైన్‌మెన్ పగిడి పుల్లయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లయ్య దంపతులను శాలువాతో సత్కరించారు. అనంతరం డీఈ మాట్లాడుతూ.. వృత్తిలో అంకితభావంతో పని చేసి అందరి మన్ననలు పొంది విధినిర్వహణలో విశిష్ట సేవలుందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ కోడిరెక్క రవికుమార్, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఏఈ రవీందర్‌రెడ్డి, టీఆర్ఎస్ కెవీఎస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మారం శ్రీనివాస్, వైవి.గిరి, రాచకొండ వెంకన్న, చంద్రశేఖర్, పాండురంగ, హరికిషన్, కొండల్, వినయ, అనూష, నవీన్, మురళి, షఫి, సైదులుతో పాటు పగిడి పుల్లయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


ఎల్లయ్య దంపతులను సత్కరిస్తున్న ట్రాన్స్ కో డీఈ శ్రీనివాస చారి, విద్యుత్ సిబ్బంది

నెరవేరనున్న పేదల సొంతింటి కల


ప్రొసీడింగ్ పత్రం అందజేస్తున్న నాయకులు

నిడమనూరు : ఇందిరమ్మ ఇళ్ల పథకంతో సొంతింటి కల నెరవేరుతుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పసుపులేటి సైదయ్యనాయుడు, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. గురువారం మండలంలోని సూరేపల్లిలో ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాలు అందజేసి, ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. సూరేపల్లి గ్రామానికి 20 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముంగి శివమారయ్య, నందికొండ మట్టారెడ్డి, నర్సింగ్ విజయ్‌కుమార్, సూరేపల్లి కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

త్రిపురారం : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ మండల అడ హక్ కమిటీ అధ్యక్షుడు పావనగుడ్ల వెంకటాచారి అన్నారు. గురువారం మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి కంపాసాగర్ గ్రామంలో గడప గడపకు పర్యటించి ప్రజా సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమైందన్నారు. ఈకార్యక్రమంలో త్రిపురారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, కాముర్ల జానయ్య, గుండెబోయిన వెంకటేశ్వర్లు, శ్యాంసుందర్ రెడ్డి, జంగిలి శ్రీనివాస్, శ్రీను పాల్గొన్నారు.

డీ40 కాల్వల ద్వారా చెరువులు నింపాలి

మాడుగులపల్లి : డీ40 కాల్వల ద్వారా చెరువులు నింపాలని డిమాండ్ చేస్తూ మండలంలోని గుర్రప్పగూడెం గ్రామానికి చెందిన రైతులు గురువారం నూకనాయన చెరువులో దిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ డీ40 కాల్వ ద్వారా చివరి ఆయకట్టు మండలంలోని అన్ని చెరువులను నింపడంతోపాటు ఆయకట్టుకు నీరందించాలన్నారు. లేకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ముందు చూపుతో ఉదయ సముద్రం ప్రాజెక్టును నింపి డీ40 కాల్వ ద్వారా చెరువులను నింపితే సమస్య వచ్చేది కాదని వృథాగా సాగర్ గేట్లు ఎత్తి నీటిని వృథా చేస్తున్నారనిన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చివరి ఆయకట్టు రైతులకు నీరందించడంతోపాటు చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కర్ర ఇంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకన్న, నాగయ్య, పాల్గొన్నారు.


గుర్రప్పగూడెం చెరువులో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఉల్సాయిపాలెంలో తీజ్ వేడుకలు


తీజ్ వేడుకల్లో పాల్గొన్న స్కైలాబ్‌నాయక్

అడవిదేవులపల్లి : మండలంలోని ఉల్సాయిపపాలెం గ్రామంలో గురువారం తీజ్ పండుగను గిరిజనులు సంస్కృతి, సంప్రదాయాలతో ఘనంగా నిర్వహించారు. గిరిజన మహిళలు తొమ్మిది రోజుల పాటు ఎంతో నిష్టతో ఉంటూ జీవితంతో మంచి భర్త రావాలంటూ, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలంటూ ఈ తీజ్ పండుగను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, కొర్ర అశోక్‌నాయక్, లచ్చుర్ నాయక్, సూక్యానాయక్, విజయ్, లాలు, హనుమంతు, పాండు తదితరులున్నారు.